భూషణం వైరాగ్యం

రమణ

"స్వామీ! స్వామీ! వింతచూశాను వివరించి చెప్పాలి" అన్నాడు గోప కుమారుడు—దశాశ్వమేధ ఘట్టంలో జపం చేస్తున్న మణిసిద్ధుడి వద్దకు పరుగున వచ్చి.

మాట్లాడకపోతే సతాయింపు తప్పదని అనుభవంమీద తెలుసుకున్న మణిసిద్ధుడు ధ్యానానికి ఉద్వాసన చెప్పి కళ్లు తెరచాడు. "వత్సా! గోపా! ప్రాణాంతకా. చెప్పు నీ సందేహం" అన్నాడు.

గోపన్న చెప్పాడు: "స్వామీ! ఇందాక అలా తిరుగుతూ, ఒక సత్రంలోకి వెళ్లాను. పాతికేళ్లు పైబడని ఒక యువకుడి చుట్టూ చుట్టపక్కాలు చేరి పరిపరి విధాల బ్రతిమాలుతున్నారు. అతగాడు, ఇవాళ ఇక్కడ బంగాళదుంప వదిలేస్తానంటున్నాడట. చివరికి బంగాళదుంపకూర, వేపడం మాత్రం వదిలివేసేటట్లు ఒప్పిస్తున్నారు. ఈ ధర్మసూక్ష్మం ఏమిటి స్వామీ?"

మణిసిద్ధుడు మందహాసం చేశాడు. "గోపా. కలియుగ మానవులపై ఈ కూర ప్రభావం ఎంత ఉందో నీకు తెలియదు. అంత గొప్పకూర కాబట్టే, దానితో చేసే రెండు రకాల వంటకాలను, రెండు వేర్వేరు కూరలుగా పరిగణించి వర్జించమంటున్నారు." అన్నాడు.

"అంత మంచికూర అయితే, కందా చేమా కాకరకాయ ఉండగా, ఈ కూరనే వదిలివేసేటంత విరక్తి ఎందుకు కలిగింది స్వామీ! పైగా, ఇరవై రెండేళ్ల పడుచు,- అతడి ఇల్లాలు—ఆమె కూడా ఆ కూరనే వదిలివేస్తోంది. "ఏమా కథ స్వామీ?" అన్నాడు గోపన్న కుతూహలంతో.

దివ్యమణి ప్రభావంవల్ల ఆ కథ యావత్తూ కరతలామలకం చేసుకున్నవాడై, సిద్ధుడు గోపకుమారుడికి ఇలా తెలియ చెప్పాడు.

"ఓ గోపా. తుమ్మెద రెక్కలవంటి మీసాలుగల ఆ చిన్నవాడికి మొన్న మొన్ననే ఉద్యోగం అయింది. పేరు నాగభూషణరావు. వలచి వలపించుకున్న కన్నెను వెంటనే పెళ్ళిచేసుకుని, బొమ్మరిల్లువంటి చిన్న పెంకుటింట్లో కాపురం పెట్టాడు. ఆమె పేరు సుబ్బులు. ఒకపక్క వలపుతో తీయని కలలుకనడం, ఆ కలలగురించి మెలకువగా ఉన్నపుడు ఆలోచించుకోవడం, మరీ ఖాళీగావున్నపుడు సినిమాపాటలు పాడుకోడం, అవీ విసుగెత్తినపుడు పాఠాలు చదువుకోవడం మొదలైన పనులవల్ల, ఆ పడుచు పాకశాస్త్రం ఏమంత బాగా నేర్చుకోడానికి వీలులేకపోయింది. ఫలానా కూరకి పోపులో మెంతులు వెయ్యవచ్చునా కూడదా, ఎన్ని మిరపకాయలు వెయ్యాలి- ఇత్యాది విషయాలలో అనుమానం వేస్తే, ఎక్కడిదక్కడ వదలివేసి, పక్కవీధిలోనే వున్న పుట్టింటికి చెంగున పరుగెత్తుకెళ్ళి కనుక్కువచ్చేసేది. ఇలావుండగా ఒకనాడు భూషణరావు ఆఫీసుకువెళ్తూ సాయంత్రం సినిమాకి వెళదామని చెప్పాడు. సుబ్బులు ఐదుగంటలకల్లా విస్తరాకెయ్యడం మొదలుపెట్టి ఐదున్నరకే కుంపటి రాజేసింది. బంగాళదుంపలు అమ్మొచ్చాయి. బేరమాడి ఏబులం కొంది. వాటివంక తేరిపారచూచి, అవ్వే చాలవనుకొని మరో ఏబులం కొంది.

"వాటిని తరిగినపుడుమాత్రం ఇద్దరికెన్నెందుకా అనుకొని, ఏబులమే తరిగి ఉడకేసింది. వాటిని దింపి బియ్యం పడేద్దామనుకుంటూనే మరోసారి చూచింది. కూర చాలదే అని ఆలోచిస్తూ అంచనా వేస్తూ ఉడికిన ముక్కలు తొక్కలు ఒలిచి చాలదని అప్పటికి నిర్ధారణచేసుకుని, చకాచక మిగతా దుంపలుకూడా తరిగేసి ఉడకవేసింది. ఐదునిమిషాలలో భర్త వచ్చాడు - వంటయిందా సినిమా కెళదాం అంటూ. అయిపోవచ్చింది మీరు మొహం రుద్దుకుని పౌడరు వేసుకునితయారవండి అంది సుబ్బులు ధీమాగా. అతగాడు ముస్తాబైపోయి, జట్కా పిలవనా అంటూ వంటింట్లోకి వచ్చాడు. ఆలస్యం అవుతోందన్న ఆదుర్దాలో ఉడికీ ఉడకని బంగాళాదుంపముక్కలను దింపేసి వచ్చినంతవరకూ తొక్కలుతీసి ఉడికిన ముక్కలూ ఉడకని ముక్కలూ ఆదరాబాదరా గుచ్చెత్తి పోసేస్తోంది.

ఆ బంగాళాదుంపలకూర చూడగానే భూషణం గుండె గుభేలుమంది. ఏమే హాయ్ హోయ్ ఏమిటది హేమిటదీ అనేశాడు హడావుడిగా. ఆ కేకలువిని పాపం తేలో కాబోలనుకున్న సుబ్బులుతుళ్లిపడింది.

"ఏమిటండీ, ఏమిటండీ" అంది భర్తవంక చూస్తూ.

"ఏమిటదీ, ఏమిటదీ" అన్నాడు భూషణం బంగాళదుంపల కూరవంక చూస్తూ

"కూర".

"ఇది సత్రమా సంసారమా. ఇద్దరికోసం రెండువీశెల దుంపలా?" అన్నాడు భూషణం.

"రెండు ఏబులాలే, చాలవనుకుని వండాను."

"ఇద్దరికెంత కూర కావాలో తెలియని నువ్వెందుకు పనికొస్తావు? తెలీకపోతే ఎవరినైనా అడగరాదా? పుస్తకాలుకొని చదవరాదా? ఇంత దుబారాచేస్తే ఎలా" అని భూషణం గదమాయించాడు.

సుబ్బులు బిక్కమొగం వేసింది. భూషణం అంతటితో ఊరుకోక, 'హుం' అని మరీ ఆగడంతో తిక్క తిరిగింది. గబగబా పోపు వేయించి, కూరముక్కలు అందులో పడేసి గిరగిరతిప్పి దింపి అక్కడ పెట్టి, చెంగుబిగించి, అవతలవీధిలో పుట్టింటికి చరచర వెళ్లిపోయింది. ముస్తాబైన భూషణం మొహం ముడుచుకున్నాడు. ఎక్కడికి? ఎందుకు వెళ్తావుబేలా ఈ టైం అని పలకరించలేదు. దగ్గరకుతీసుకుని సముదాయించలేదు. సరాసరి ఒక స్నేహితు

"పట్టుమని పాతికేళ్లు నిండని ఆ చిన్నవాడికి అప్పుడే బంగాళ దుంపకూరమీద అంత విరక్తి ఎందుకు కలిగింది?" అని అడిగాడు గోపకుమారుడు.

"ఉడికీ ఉడకని కూర కటుకు తెలియక" అన్నాడు మణిసిద్ధుడు మందహాసం చేస్తూ.

డింటికి బయల్దేరాడు. ఆయనగారుకూడా ప్రాణేశ్వరిమీద అలిగి, షికారు బయలుదేరారు. ఇద్దరూ కలిసి సాయంత్రం ఏడున్నర వరకూ తిరిగారు. కరకర ఆకలి వెయ్యడంతో, భూషణం స్నేహితుడు ఇంటి ముఖం పట్టాడు. భూషణంకూడా ఏం పాలుపోక జంకుతూనే అత్తారింటికి వెళ్లాడు.

అక్కడంతా పెందరాళే భోజనాలుచేసి ఆరుబయట వెన్నెట్లో పక్కవేసుకు పడుకున్నారు. ముందర వాకిట్లో మొగాళ్లు, వెనక పెరట్లో అత్తగారు, బామ్మగారూ మొదలైనవారూ పడుకుని కబుర్లాడుకుంటున్నారు.

వెళ్ళగానే మావగారు పలకరించాడు: "ఏం భూషణం. ఇవాళ పదింటికే భోంచేశావుటే, అమ్మాయి చెబుతోంది" అన్నాడు.

భూషణం తెల్లబోయాడు: "సుబ్బులు అలా అని చెప్పింది కాబోలు" అనుకుని, ఆశ్చర్యపడి, తమాయించుకుని, 'మరేనండి. ముందర సినిమా కెళ్దాం' అనుకున్నాం. తర్వాత పనిమీద అలా వెళ్లాల్సొచ్చింది" అన్నాడు.

మావగారు అటువేపు తిరిగి వాళ్ళ తోడల్లుడుతో మాట్లాడుతున్నారు. తను వచ్చినట్లు మరదలుపిల్లద్వారా పెరట్లోకి కబురు వెళ్ళిం దప్పుడే. పావుగంట గడిచినా సుబ్బులు అంతఃపురోద్యానవనం దాటివచ్చే ఛాయలు కనబడలేదు భూషణానికి. వాలుకుర్చీలోపడుకుని నీలాకాశంవంక చూశాడు. సుబ్బులు లేతమనసులో మొండితిక్కలా ఆకాశంలో మబ్బుపింజ ఒకటి చలనం లేకుండా ఉంది. కదలదేం అనుకున్నాడు. అతగాడికి ఆ సమయంలో మేఘ సందేశం జ్ఞాపకం వచ్చింది. రివ్వున గాలివీచి పెద్ద మబ్బుకమ్మితే పెరట్లోంచి సుబ్బులు, వాకిట్లోంచి తనూకూడా చెంగున సావిట్లోకి దూకితీరవలసిందే ఎవరూ ఓడినట్లవదు.

ప్రాధేయపూర్వకంగా చూశాడు కాని మబ్బుపిల్ల మనసు కరగలేదు. అందుకని మరదలు పిల్లని పిలిచాడు.

"సరేలే కాసిని మంచినీళ్లు తెమ్మను" అన్నాడు.

'అక్కర్లేదుటే' అన్న జవాబు, కాసిని మంచినీళ్లు పట్టుకుని మరదలుపిల్లే తిరిగి వచ్చింది, భూషణం కోపగించుకుని, మళ్లా షికారెళ్ళి పోయాడు. ఆకలి వేస్తున్నా, తిక్క మూలాన, చిరుతిళ్లు తిన బుద్ధి కాలేదు. పదిన్నరకి ఇల్లు చేరాడు. ఓరగిలా ఉన్న తలుపుతీసి లోపలికి వెళ్లాడు.

సుబ్బులు నిద్రపోతోంది. భూషణం కూడా మాట్లాడకుండా పడుకున్నాడు కాని, ఆకలి వల్ల నిద్ర రాలేదు. అలవాటు ప్రకారం, అతి నెమ్మదిగా లేచి వంటింట్లోకివెళ్ళి గిన్నెలు తడిమాడు. అన్నం గిన్నం లేదు. బంగాళ దుంపల కూర మాత్రం ఉంది. అదే కాస్త తినబోయాడు కాని కూర ఏమీ ఉడకలేదు. ఆకలిమూలాన, అదే బలవంతాన కాస్త తినేశాడు. మజ్జిగ గిన్నె చూస్తే ఖాళీగా ఉంది. మర్నాటికని తోడేసిన పాలు కనబడ్డాయి. కళ్లు మూసుకుని తాగేశాడు. దడీ చప్పుడూ లేకుండా వచ్చి పడుకున్నాడు. "జన్మలో ఇక బంగాళదుంప కూర తినకూడదు" అని నిద్ర పోయేముందు ఒట్టు పెట్టుకున్నాడు. అంత విరక్తి కలిగింది ఆ కూర తిన్నాక.

తెల్లవారాక ఒకర్నొకరు ఎలా పలకరించుకోవాలో తోచక తిప్పలు పడుతున్న ఆ జంట పాలిట దేవతలల్లే భూషణరావు తల్లి తండ్రులు అప్పచెల్లెళ్లు బిలబిల మంటూ బండి దిగారు. "అనుకోకుండా కాశీయాత్ర ముహూర్తం పెట్టుకున్నాంబాబూ నువ్వూ నీ పెళ్లాం కూడా బయల్దేరండి" అని ఆజ్ఞాపించాడు భూషణం తండ్రి. ఆ తరవాతి గలభాలో సుబ్బులు భూషణం మాట్లాడుకున్నారు కాని, మనసు విప్పి కాదు. నువ్వు ఇందాక వెళ్ళేసరికి తర్జన భర్జన జరగడానికి కారణం అదే. పెళ్లానికి బంగాళదుంపకూర వండడం రాదని, అందువల్ల వదిలివేయడం ఉత్తమమనీ భూషణం గట్టిగా నిశ్చయించుకున్నాడు. ఆరోజు రాత్రి బలవంతాన ఆ ఉడికీఉడకని కూరతో కడుపు నింపుకోవడంవల్ల పూర్తిగా అదంటే వెలపరం విరక్తి కలిగాయి. ప్రాణేశ్వరుడే వదిలేస్తూఉంటే తనకుమాత్రం ఎందుకని ఆపిల్లకూడా ఆకూరే వదిలేసింది. ఉడకని కూర తినడమే మొగుడి విరక్తికి కారణమని ఆ ఇల్లాలికి తెలియదు. తెలిస్తే అసలు రహస్యం చెప్పివేసేదే. ఆ రహస్యం తెలియనందువల్లనే ఆచిన్నవాడుకూడా తనభార్యకి అసలు బంగాళదుంప వండడంచేతకాదని నిర్ధారణ చేసుకున్నాడు. చుట్టాల రాకవల్ల కాశీయాత్రవల్ల ఈ రహస్యం మరుగున పడింది."

గోపన్న కథవినగానే లేచినించున్నాడు. "స్వామీ తాము వెంటనే ఆ రహస్యం నాకు తెలియచెప్పండి. నేను పరుగునపోయి ఆ ప్రమాదానికి అడ్డుపడతాను" అన్నాడు.

మణిసిద్ధుడు నవ్వి ఇలా అన్నాడు:

"ఆరాత్రి తొమ్మిదిగంటలవేళ ఇల్లుచేరిన సుబ్బులు ఆకలికొద్దీ, ఆ ఉడికీ ఉడకని బంగాళదుంపల కూరలో ఉడికినదంతా తినేసి, మజ్జిగతాగి పడుకొంది. గంటన్నర తరువాత ఆవురావురుమంటూవచ్చి, ఉడకని కూరముక్కలుతిన్న భూషణం ఈరహస్యం తెలియక, భార్య వంటసామర్థ్యమే అంత అని అపోహపడి ఇప్పుడు ఆకూర వర్జిస్తున్నాడు అందువల్ల ఓగోపా ..."

గోపకుమారుడు చెంగున గంతువేసి, స్నానాలరేవుకు రివ్వున పరుగుతీశాడు. ★

హైస్కూలు తెలుగుపండితుని ఇంట్లో అర్ధరాత్రివేళ దొంగ పడ్డాడు. పండితునికి మెలకువ వచ్చింది. దొంగ కత్తి తీసి బెదిరించాడు: "అరిచావంటే పొడిచేస్తాను. నేను మీ డబ్బు ఎక్కడుందో వెదుకుతున్నాను."

"కాస్త ఓపిక పట్టవయ్యా. దీపం వెలిగిస్తాను. ఇద్దరంకలిసే వెదుకుదాము," అన్నాడు పండితుడు.

వ్యాసుని వ్రాయసకాడు

(9 వ పేజీ తరువాయి)

చేతులూ జోడించి, తలవంచి.."ఎంతమాట! దేవరవా రంతరాయం కలిగించకపోవడం వల్లనే గదా, నా ప్రజ్ఞాబలం పని చేసేది!" అన్నాడు.

వినాయకుడు "గంటం నిలిపి, సగౌరవంగా వ్యాసునికేసి చూసి—

"ఔరా! ఎంతటి మాటకారివయ్యా! మహాకవీ!" అని మెల్లిగా బొజ్జ నిమురుకుంటూ ఒక్కసారిగా కలకల నవ్వాడు!

చుట్టూరా ఉన్న ఋషిగణం ఆనంద కోలాహలం మిన్ను ముట్టింది! ★